క్లుప్తంగా

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు



స్కాలర్‌షిప్ అందుకుంటున్న విద్యార్థులు

రాజానగరం: విద్యాజ్యోతి పథకం ద్వారా దివాన్ చెరువులోని కెనరా బ్యాంకు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.24 వేలను స్కాలర్‌షిప్‌గా అందజేసింది. మండలంలోని పాలచర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 5 నుంచి 10వ తరగతి చదువుతున్న పైకేటగిరీలకు చెందిన ఆరుగురు ప్రతిభావంతులైన విద్యార్థులకు బ్రాంచ్ మేనేజర్ దేవిరెడ్డి ఢిల్లీరావు మంగళవారం అందజేశారు.

రేపు విద్యుత్ అంతరాయం

మధురపూడి: చెట్ల కొమ్మల తొలగింపు, 11 కేవీ ఫీడర్ లైన్ మరమ్మతుల నేపథ్యంలో సీతానగరం మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు. ఈ నేపథ్యంలో వంగలపూడి, సింగవరం, పెద్ద కొండేపూడి, చీపురుపల్లి, అచ్చియ్యపాలెం గ్రామాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ సరఫరా నిలిచిపోతుందన్నారు. అయితే వ్యవసాయ బోర్లకు మాత్రం సరఫరా యథాతథంగా కొనసాగుతుందన్నారు.

పెదపూడి: అనపర్తిలో కొమ్మల కత్తిరింపు కారణంగా పోతవరం సబ్ స్టేషన్‌లోని ధరణికోట, సావారం, మహేంద్రవాడ ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీధర్ వర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనపర్తిలో ధరణికోట, పాత ఊరు, బాపనమ్మ గుడి ఏరియా, సావారం కాలనీ మహాలక్ష్మిపేట, సీడీఆర్ హాస్పిటల్ ఏరియా, మార్కెట్ ఏరియా, మెయిన్‌రోడ్ కెనాల్‌రోడ్, కెఎల్ఎస్ పురం, కొప్పవరం, మహేంద్రవాడ తదితర గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని తెలిపారు.

వినాయక చవితికి రాట ముహూర్తం



పందిరి రాటకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి దంపతులు

బిక్కవోలు: మండలంలోని శ్రీలక్ష్మీ గణపతి ఆలయం వద్ద వచ్చే నెల ఏడో తేదీన వినాయక చవితి వేడుకలకు గురువారం పందిరి రాట ముహూర్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మహాలక్ష్మి దంపతుల చేతులమీదుగా నిర్వహించారు. ముందుగా అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలోని ఆలయం కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

పెదపూడి: అనపర్తి గాంధీనగర్ బుల్లయ్య తోట వద్ద కొలువుదీరిన ప్రసన్న ఆంజనేయ స్వామి వారి ఏడో వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధి మేడపాటి చెల్లారెడ్డి బుధవారం తెలిపారు. వార్షికోత్సవం సందర్భంగా స్వామి వారికి ఉదయం ఐదు గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రత్యేక పూజలు చేయనున్నామన్నారు.

పల్లెల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలి



రంగంపేట ఎంపీపీ కార్యాలయంలో శిక్షణ అనంతరం ప్రజా ప్రతి నిధులు, అధికారులు

రంగంపేట: పల్లెల సమగ్రాభివృద్ధికి సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో కృషి చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో చివరి రోజు బుధవారం సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించాలని సూచించారు. ఎంపీడీఓ పి.వెంకటరత్నం మాట్లాడుతూ పంచాయతీరాజ్ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు 12 నుంచి 14 వరకూ మూడు రోజులు పాటు శిక్షణ నిర్వహించామని మాస్టర్ ట్రైనీలు లంకా త్రిమూర్తులు, జి.వి.రమణ, ఎన్.కాత్యాయనీలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిపాలనాధికారి ఎం.వెంకటేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ ఏవీవీ సత్యనారాయణ, జూనియర్ అసిస్టెంట్ యు.మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

బాపూజీ స్ఫూర్తి.. చైతన్య దీప్తి

- దోసకాయలపల్లి, సీతానగరం గ్రామాల్లో గాంధీ మహాత్ముని పర్యటన
- విదేశీ వస్త్రాల దహనం



దోసకాయలపల్లిలో విదేశీ వస్త్రాలను దహనం చేసిన ప్రాంతంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయం

మధురపూడి: అహింస అనే ఆయుధం చేతబూని, దేశ ప్రజలందరికీ శాంతి సైనికులుగా తయారు చేసి, ఆంగ్లేయులపై పోరాటం చేసిన మహాత్మాగాంధీ త్యాగాలు వెలకట్టలేనివి. స్వాతంత్య్ర ఉద్యమ సమయంలో ప్రజలందరిలో స్ఫూర్తిని రగిలించడానికి ఆయన అనేక ప్రాంతాలలో పర్యటించారు. ఆ సందర్భంగా సీతానగరం, కోరుకొండ మండలం దోసకాయలపల్లి గ్రామాలకు ఆయన విచ్చేశారు. ఆయన పాదస్పర్శతో ఈ ప్రాంతాలు పునీతమయ్యాయి. ఆయన పిలుపుతో ఇక్కడి ప్రజలు ముందుకు సాగారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఆనాటి స్ఫూర్తిదాయక ఘట్టాలను స్మరించుకుందాం.

విదేశీ వస్త్ర బహిష్కరణ

బ్రిటీష్ పాలకులపై పోరాటంలో భాగంగా మహాత్ముడు విదేశీ వస్త్ర బహిష్కరణ చేపట్టారు. దేశవ్యాప్తంగా ప్రజలలో చైతన్యం రగిల్చారు. తాను కూడా వివిధ ప్రాంతాలలో పర్యటించి ప్రజలకు ఉద్యమ స్ఫూర్తిని కల్పించారు. ఆ కార్యక్రమంలో భాగంగా 1932 అక్టోబర్‌లో దోసకాయలపల్లి వచ్చారు. సుమారు 50 మందితో కలిసి విదేశీ వస్త్రాలను దహనం చేశారు. స్వదేశీ వస్త్రాలను ధరించాలని పిలుపునిచ్చారు. వారిలో 20 మందికి మహిళలు కూడా పాల్గొన్నారు. కోరుకొండ తాలుకాలోని ప్రజలందరిలో ఈ కార్యక్రమం చైతన్యం కలిగించింది. దోసకాయలపల్లిలో విదేశీ వస్త్ర బహిష్కరణ జరిగిన ప్రాంతంలోనే తర్వాత కాలంలో లైబ్రరీ నిర్మించారు. ఇప్పటికీ ఇది కొనసాగుతోంది.

మొక్క నాటిన గాంధీజీ

విదేశీ వస్త్ర బహిష్కరణ జరిగిన ప్రాంతానికి దగ్గరలోనే నాడు గాంధీజీ రావిమొక్కను నాటారు. నేడు అది పెద్ద వృక్షంగా మారి నాటి ఘటనకు సజీవ సాక్ష్యంగా నిలిచింది. ఆ చెట్టు నాటి దాదాపు 90 ఏళ్ల పైగా అవుతోంది. ప్రస్తుతం దాని చెట్టు సిమెంట్ దిమ్మ నిర్మించారు. గ్రామస్తులందరూ దానిపై కూర్చుని పలు విషయాలు చర్చించుకుంటారు. దాన్ని రావిచెట్టు ప్రాంగణమని, గాంధీ నడయాడిన ప్రదేశమని పిలుస్తున్నారు. అలాగే సీతానగరం గ్రామానికి మహాత్మా గాంధీ రెండు దఫాలుగా వచ్చారు. ఆశ్రమంలో రాట్నంపై నూలువడికారు. ఆయన నూలు వడికిన రాట్నం నేటికీ భద్రంగా ఉంది.



భారీ వృక్షమైన గాంధీ నాటిన రావి మొక్క

ఎంతో ప్రత్యేకత



నాడు విదేశీ వస్త్రాల దహనం జరిగిన ప్రాంతాన్నే నేడు గ్రంథాలయం సెంటర్‌గా పిలుస్తున్నారు. ఈ ప్రదేశంలోనే 1935లో గ్రంథాలయం నిర్మించారు. గ్రామం నడిబొడ్డున ఉన్న లైబ్రరీ సెంటర్‌కు నేటికీ ప్రత్యేకత ఉంది.

– సత్యనారాయణ, గ్రంథాలయాధికారి

స్ఫూర్తిదాయకం



స్వాతంత్య్ర ఉద్యమంలో దోసకాయలపల్లికి ప్రత్యేక స్థానం ఉంది. ఇక్కడ జరిగిన విదేశీ వస్త్రాల దహనం ఘట్టాన్ని పూర్వీకులు ఇప్పటికీ చెబుతూ ఉంటారు. గాంధీజీ రాకతో ఆ ప్రాంతానికి ఎంతో పేరు వచ్చింది.

– కర్రి నాగేశ్వరరావు, జెడ్పీటీసీ

పాఠశాలల్లో జెండా పండగ సందడి



పందలపాకలో ఉన్నత పాఠశాల వద్ద జాతీయ జెండాలను కడుతున్న విద్యార్థులు



కొంకుదురు ఉన్నత పాఠశాలలో డెకరేషన్ కాగితాలను తయారు చేస్తున్న విద్యార్థులు



కొంకుదురు ఉన్నత పాఠశాలలో డెకరేషన్ దండలతో విద్యార్థులు

బిక్కవోలు: స్వాతంత్య్ర వేడుకలకు అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాలు సిద్ధమయ్యాయి. పాఠశాలల్లో విద్యార్థులు క్లాస్ రూములను ముస్తాబు చేశారు. జెండా ఆవిష్కరణకు అంతా పూర్తి చేశారు. అంతేకాకుండా చేతికి వేసుకునే బ్యాండ్లు, షర్ట్ జేబుకు తగిలించుకునే కాగితపు జెండాలు కూడా అందుబాటులో ఉంచారు. అంతేకాకుండా వివిధ ఆకృతుల్లో బ్యాస్ మెటల్‌తో చేసిన జెండాలు, టేబుల్‌పై ఉంచే జెండాలు, కాషాయం, తెలుపు, ఆకుపచ్చ రంగులతో కూడిన దండలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. విద్యార్థులు సొంతంగా డబ్బులు సమకూర్చుకుని ముస్తాబు చేసుకున్నారు. పందలపాక, కొంకుదురు గ్రామాల్లో స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా జెండాలతో అలంకరించడానికి బుధవారం విద్యార్థులంతా కలసి కట్టుగా పాఠశాలను అందంగా తీర్చిదిద్దిన తీరును చూసిన ఉపాధ్యాయులు, గ్రామస్తులు వారిని అభినందించారు.

మువ్వన్నెల రెపరెపలు



రాజానగరంలో 300 అడుగుల జాతీయ జెండాతో నిర్వహించిన ర్యాలీ

పెదపూడి: ప్రతి ఇంటిపైన, షాపులపైన జాతీయ జెండాలను ఎగురవేయాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తిలో బుధవారం మహాత్మా గాంధీ బొమ్మ సెంటర్ నుంచి దేవీచౌక్ వరకు ఆజాది కా అమృత్ మహోత్సవంలో భాగంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటిపై, షాపుల వద్ద జాతీయ జెండాలు ఎగర వేయాల్సి కోరారు.

అనపర్తి జీబీఆర్ డిగ్రీ కళాశాలలో

అనపర్తి జీబీఆర్ డిగ్రీ కళాశాల ప్రాంగాణంలో ఆజాదీకా అమృత మహోత్సవంలో భాగంగా జాతీయ జెండాను చేపట్టి స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలను కొనియాడారు. అనంతరం భారీ ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో జీబీఆర్ డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌పీ అబ్బాయిరెడ్డి, పీఆర్ఎల్ స్వామి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు సీహెచ్ ఆనందరావు, కే రామకృష్ణ, టీవీ వెంకటేశ్వరరావు, అధ్యాపకుడు నాయక్ నాగబాబు, ఏఓ బి.సుబ్బారావుశాస్త్రి, విద్యార్థులు పాల్గొన్నారు.

300 అడుగుల జాతీయ జెండాతో రాజానగరంలో ర్యాలీ

రాజానగరం: స్వాతంత్య్ర వేడుకల్లో భాగంగా రాజానగరంలో బుధవారం సుమారు 300 అడుగుల పొడవైన జాతీయ జెండాతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో మండల ప్రజాపరిషత్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ గ్రామంలోని ప్రధాన వీధుల మీదుగా సాగి గాంధీ బొమ్మ సెంటర్‌కు ఈ సందర్భంగా విద్యార్థులు జాతీయ సమైక్యతను చాటుతూ వివిధ రకాల వేషధారణతో ఆకట్టుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎందరో మహనీయుల త్యాగాలతో సిద్ధించిన స్వాతంత్య్ర ఫలాలను భావితరాలకు కూడా అందించే క్రమంలో దేశ సమగ్రతను కాపాడుకోవడం మనందరి కర్తవ్యమన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు వరసగా మూడో సంవత్సరం కూడా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని జరుపుకొంటున్నామన్నారు. ఇదే స్ఫూర్తితో మన తెలుగువాడైన పింగళి వెంకయ్య రూపొందించిన జాతీయ పతాకాలను ఇళ్లు, కార్యాలయాపై ఎగురవేయాలన్నారు. అలాగే నామవరంలోని భారతీయ విద్యా భవన్‌లో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని మంగళవారం వేడుకగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ వీరేంద్రనాథ్ మాట్లాడుతూ స్వాతంత్య్ర దినోత్సవ ప్రాధాన్యతను, ప్రాముఖ్యతను తెలియజేశారు.



అనపర్తి జీబీఆర్ కళాశాలలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు అధ్యాపకులు తదితరులు



బీవీబీలో విద్యార్థుల ప్రదర్శన

ఆక్రమణల తొలగింపునకు చర్యలు

- జెడ్పీ బంగ్లాను పరిశీలించిన ఆర్డీవో లక్ష్మీశివజ్యోతి
- 'సాక్షి' కథనానికి స్పందన



ప్రభుత్వ బంగ్లాను పరిశీలిస్తున్న ఆర్డీఓ లక్ష్మీశివజ్యోతి

సాక్షి ఇంపాక్ట్

రాజానగరం: స్థానికంగా నిరుపయోగంగా ఉన్న కోట్లాది రూపాయలు విలువ చేసే జిల్లా ప్రజాపరిషత్‌కు చెందిన బంగ్లాను రాజమహేంద్రవరం ఆర్డీఓ కె.లక్ష్మీశివజ్యోతి మంగళవారం సాయంత్రం సందర్శించారు. 'ఆక్రమణల చెరలో ప్రభుత్వ బంగ్లా' అనే శీర్షికతో శనివారం 'సాక్షి'లో వచ్చిన కథనానికి ఆమె స్పందించారు. బంగ్లాతో పాటు పరిసరాలను, అక్కడ ఉన్న ఆక్రమణలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. తక్షణమే ఆక్రమణలను తొలగించి, బంగ్లాను, పరిసరాలను పరిరక్షించాలని వెంట వచ్చిన స్థానిక తహసీల్దార్ లక్ష్మీ లావణ్యను ఆదేశించారు. గ్రామంలో ప్రధాన రోడ్డుకు ఇరువైపులా పెరుగిపోతున్న ఆక్రమణలను, ప్రయాణికులు పడుతున్న ఇక్కట్లను ప్రస్తావించగా.. ప్రజలకు ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక – మీ కోసంలో ఫిర్యాదు చేయవచ్చన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీతానగరం ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న

రాజానగరం: మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు (గ్రేడ్ ఒకటి నుంచి ఐదు వరకు) స్థానిక మండల ప్రజాపరిషత్ మీటింగ్ హాలులో మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ (ఆర్‌జీఎస్ఏ) కార్యచరణ ప్రణాళికలో భాగంగా పరిసరాల పరిశుభ్రత, పంచాయతీల అభివృద్ధి కార్యాచరణ, వీధి దీపాలు మున్నగు అంశాలపై ఈ శిక్షణ జరిగింది. ఈ శిక్షణకు కోర్సు డైరెక్టర్‌గా ఎంపీడీఓ జ్యోతిర్మయి, అసిస్టెంట్ కోర్సు డైరెక్టర్‌గా సూపరింటిండెంట్ సుబ్రహ్మణ్యం వ్యవహరించారు.

కోరుకొండలో ..

గ్రామాలలో పారిశుధ్యాన్ని మెరుగుపర్చడం ద్వారా ప్రజల ఆరోగ్యానికి శ్రద్ధ వహించాలని సీతానగరం ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న అన్నారు. కోరుకొండ మండలం కాపవరంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జరిగిన పంచాయితీ సర్పంచ్‌లు, కార్యదర్శుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎంపీడీఓ హేమసుందర్రావు కోర్సు డైరెక్టర్‌గా వ్యవహరించారు.

కేవీకేలో నిరుద్యోగ యువతకు శిక్షణ

రాజానగరం: మండలంలోని కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో బుధవారం నిరుద్యోగ యువతకు శిక్షణ ప్రారంభించారు. పశుసంవర్ధక రంగంలో పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించే విధంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలపై ఈ శిక్షణ ఇస్తున్నారు. కేవీకే అధికారి బి.నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ కోడి, గొర్రె, మేక మాంసాల ఉత్పత్తిని పెంచడంతో పాటు గ్రామీణ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధిని కల్పించేందుకు ×జాతీయ పశుధన మిషన్, ప్రధానమంత్రి ఉపాధి కల్పన₹ అనే రెండు పథకాలను అమలు చేస్తుందన్నారు. వీటికి సంబంధించిన యూనిట్లను జాతీయ పశుధన మిషన్ పథకం ద్వారా ఏర్పాటు చేస్తే, అందుకు అయ్యే వ్యయంలో 50 శాతం సబ్సిడీని గరిష్టంగా రూ. 50 లక్షల వరకు పొందవచ్చన్నారు. అదే ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం ద్వారా పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో ఏర్పాటు చేసే ప్రాజెక్టులను బట్టి 15 నుంచి 35 శాతం వరకు సబ్సిడీని పొందవచ్చన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఈ పథకాలకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. కేవీకే ప్రధానాధికారి డాక్టర్ వీఎస్‌జీఆర్ నాయుడు మాట్లాడుతూ ఎవరికి, ఏవిధమైన సమాచారం కావాల్సి వచ్చినా కేవీకేలో అధికారులను సంప్రదించవచ్చన్నారు.

ఎట్టకేలకు బయటకొచ్చిన ఇసుక బోటు



బయటకు వచ్చిన ఇసుక బోటు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజ్ గేట్ల వద్దకు కొట్టుకువచ్చి మునిగిపోయిన ఇసుక బోటును బుధవారం సాయంత్రం ఎట్టకేలకు బయటకు తీశారు. గత నెల 20వ తేది రాత్రి వరద నీటి ఉధృతికి ఇసుక బోటు కాటన్ బ్యారేజ్ ఒకటవ నెంబర్ గేటు వద్ద కొట్టుకువచ్చింది. బోటును అప్పట్లో తీసేందుకు ప్రయత్నించినప్పటికీ వరద నేపథ్యంలో సాధ్యం కాలేదు. అనంతరం నీటి ఉధృతి భారీగా పెరగడంతో బోటును అక్కడే వదిలేశారు. రెండుసార్లు భారీ క్రేన్లను తీసుకువచ్చి బోటును బయటకు తీసుకువచ్చేందుకు ప్రయత్నించారు. భారీ క్రేన్ల వల్ల బ్యారేజ్‌కు నష్టం కలిగే ప్రమాదం పొంచి ఉందని ఇరిగేషన్ అధికారులు పనులను నిలిపివేశారు. బోటు యజమాని బోటులో పేరుకుపోయిన పూడికను గజ ఈతగాళ్ల సాయంతో తొలగించారు. రోప్‌లను కిందకు దించి కప్పిల సాయంతో బోటును బయటకు తీశారు. ఎస్ఈ జి శ్రీనివాసరావు, ఈఈ కాశీ విశ్వేశ్వరరావు, డీఈ రమేష్, ఏఈ అద్దంకి సాయిరామ్ బోటును బయటకు తీసే పనులను పర్యవేక్షించారు.